సాక్షి
అనంతపురం
బుధవారం, 24, మే, 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



నాలుగు రోజుల్లో వర్షాలు

జిల్లాలో రానున్న నాలుగు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.



జిల్లా వ్యాప్తంగా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉన్నాయి.

విత్తనం సిద్ధం!

- సబ్సిడీ విత్తన పంపిణీకి ఏర్పాట్లు ముమ్మరం
- అదనులోనే రైతులు విత్తుకునేందుకు సహకారం
- ఆర్బీకే వేదికగా జోరుగా రిజిస్ట్రేషన్లు



అనంతపురం అగ్రికల్చర్: అదనులోనే ఖరీఫ్ పంటలు సాగు చేసుకునేందుకు జగన్ సర్కారు రైతులకు చేయూతనిస్తోంది. సకాలంలో విత్తన కాయలు అందించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా విత్తనాలపై రాయితీలు ప్రకటించింది. ఆర్బీకే వేదికగా ఇప్పటికే వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్లు జోరందుకున్నాయి. ఈ నెల చివరి వారంలో విత్తన పంపిణీకి ఏర్పాట్లు చేశారు. జూన్‌లో వర్షాలు రాగానే విత్తుకునేందుకు ఇబ్బంది లేకుండా రైతు చెంతకు విత్తనాలు చేర్చనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జె.ధనలక్ష్మి తెలిపారు.

40 శాతం రాయితీతో వేరుశనగ

ఈ సారి జిల్లాకు 78,245 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించగా.. అందులో కే-6 రకం 76,945 క్వింటాళ్లు, కదిరి-లేపాక్షి 1812 రకం 1,300 క్వింటాళ్లు అలాట్‌మెంట్ చేశారు. ఆర్బీకే వేదికగా ఇప్పటికే 20 వేల మంది రైతులు 17 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఎల్‌ఆర్‌జీ-41, 52 రకం కందులు 4,300 క్వింటాళ్లు కేటాయించారు. ఐపీఎం 2-14 రకం పెసలు 156 క్వింటాళ్లు, పీయూ-31, ఎల్‌బీజీ-752, ఐపీయూ 2-43, టీబీజీ-104 రకాలకు చెందిన మినుము విత్తనాలు 42 క్వింటాళ్లు అలాట్ చేశారు. ఇక ఎస్ఐఏ-3156 రకం కొర్రలు 250 క్వింటాళ్లు, ఇంద్రావతి రకం రాగులు 3 క్వింటాళ్లు కేటాయించి వీటిపై 50 శాతం రాయితీ వర్తింపజేశారు. అలాగే 50 శాతం రాయితీతో 200 క్వింటాళ్ల వరకు జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు (గ్రీన్‌మెన్యూర్) కేటాయించారు. విత్తనాలు అవసరమైన రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సర్టిఫైడ్, ట్రూత్‌ఫుల్ లేబుల్ (టీఎల్) సీడ్ కింద నిబంధనల మేరకు నాణ్యత కలిగిన రాయితీ విత్తనాలు రైతులకు అందించనున్నట్లు తెలిపారు.

29 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

ఈ నెల 29న విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభించడానికి వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మరోపక్క మంగళవారం నాటికి 164 ఆర్బీకేల్లో 13 వేల క్వింటాళ్ల విత్తనకాయలు నిల్వ చేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ ధనలక్ష్మి తెలిపారు. పంపిణీ మొదలు పెట్టే నాటికి ప్రతి ఆర్బీకేలోనూ కనీసం 50 నుంచి 100 క్వింటాళ్లు నిల్వ ఉండేలా విత్తనశుద్ధి, సరఫరా వేగవంతం చేశామన్నారు.



బెళుగుప్పలో విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

విత్తనాల వారీగా రాయితీ, రైతు వాటా వివరాలు

విత్తన రకం	పరిమాణం	సబ్సిడీ	రైతు వాటా (రూ.ల్లో)
కే-6 వేరుశనగ	30 కిలోల బస్తా	40 శాతం	1,674
1812 వేరుశనగ	30 కిలోల బస్తా	40 శాతం	1,494
ఎల్‌ఆర్‌జీ కంది	4 కిలోల ప్యాకెట్	30 శాతం	311.92
హైబ్రీడ్ రకం కంది	2 కిలోల ప్యాకెట్	30 శాతం	179.20
ఐపీఎం రకం పెసలు	4 కిలోల ప్యాకెట్	30 శాతం	329
మినుము	4 కిలోల ప్యాకెట్	30 శాతం	329
కొర్రలు	2 కిలోల ప్యాకెట్	50 శాతం	67.50
రాగులు	2 కిలోల ప్యాకెట్	50 శాతం	69.50
జీలుగ	10 కిలోల ప్యాకెట్	50 శాతం	395
జనుము	10 కిలోల ప్యాకెట్	50 శాతం	420
పిల్లిపెసర	8 కిలోల ప్యాకెట్	50 శాతం	3,388

నాణ్యమైన విత్తనాలు అందించండి

బెళుగుప్ప: సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు నాణ్యమైనవే రైతులకు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ సూచించారు. మంగళవారం బెళుగుప్పలోని వినాయక్ సీడ్స్‌లోని రైతులకు సబ్సిడీతో అందించే వేరుశనగ నిల్వలను ఆయన మండల వ్యవసాయ శాఖ అధికారి పృథ్వీ సాగర్, ప్లాంట్ ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి వాసుకీరాణి, ఏపీ సీడ్స్ సూపర్‌వైజర్, ప్రాసెసింగ్ ప్లాంట్ మేనేజర్ వెంకట్‌నాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం విత్తన వేరుశనగను శుభ్రపరిచి సరఫరా చేయాలని ఆదేశించారు.

రాజీ పడకూడదు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామంలో విత్తన వేరుశనగ నిల్వ కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ మంగళవారం పరిశీలించారు. విత్తన నాణ్యతలో రాజీ పడకూడదని ఆదేశించారు. నాణ్యతపై ఒక్క ఫిర్యాదూ రాకూడదన్నారు. కార్యక్రమంలో ఏడీఏ యల్లప్ప, ఏఈఓ శివకుమార్, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సివిల్స్‌లో మెరిసిన కదిరి యువకుడు

- ఆలిండియా స్థాయిలో 270వ ర్యాంకు



ఉమా మహేశ్వరరెడ్డి

కదిరి: సివిల్స్‌లో కదిరి యువకుడు బొల్లం ఉమా మహేశ్వరరెడ్డి సత్తా చాటాడు. ఆల్ ఇండియా స్థాయిలో 270వ ర్యాంకు సాధించాడు. అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్-2022 ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇందులో మొత్తం 933 మందిని యూపీఎస్సీ ఎంపిక చేసింది.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూనే...

జాతీయ స్థాయిలో 270 ర్యాంకుతో మెరిసిన బొల్లం ఉమా మహేశ్వరరెడ్డి స్వగ్రామం ఓడి చెరువు మండలం బోయపల్లి కాగా, వీరి కుటుంబం ప్రస్తుతం కదిరిలో స్థిర పడింది. తల్లి పద్మావతి విశ్రాంత ఉపాధ్యాయురాలు, తండ్రి రాజశేఖరరెడ్డి విశ్రాంత జువాలజీ లెక్చరర్. హైదరాబాద్‌లో ఐఐటీలో బీటెక్ పూర్తి చేసిన ఉమా మహేశ్వరరెడ్డి అమెజాన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే ఢిల్లీలోని 'వాజీరా'లో సివిల్స్‌కు శిక్షణ తీసుకున్నారు. తమ కుమారుడికి సివిల్స్‌లో మంచి ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వెలిబుచ్చారు.

రేపు జాబ్ మేళా



అనంతపురం టౌన్: అనంతపురంలోని జిల్లా ఉపాధికల్పనాధికారి కార్యాలయంలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.కళ్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఆపైన విద్యార్హతలున్న యువతీ యువకులకు ఫ్లిప్‌కార్ట్, నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో అర్హత సాధించిన అభ్యర్థులకు విద్యార్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.25వేల వరకు జీతం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో గురువారం నాటి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

పేదల ఉన్నత చదువులకు దీవెన

- నేడు విద్యా దీవెన నగదు విడుదల

అనంతపురం రూరల్: పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం కొండంత భరోసా ఇస్తోంది. జగనన్న విద్యా దీవెన పథకం కింద పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నాలుగు విడతల్లో చెల్లిస్తోంది. 2022-23 తుది త్రైమాసికానికి సంబంధించి విద్యాదీవెన సొమ్మును బుధవారం ఈస్ట్ గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. అనంతపురం జిల్లాలో 31,576 మంది తల్లుల ఖాతాలకు దాదాపు రూ.29.26 కోట్ల నగదు జమ కానుంది. 35,056 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. జిల్లాకు సంబంధించిన జగనన్న విద్యా దీవెన నగదు జమ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి తెలిపారు.

డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ మొదలెట్టండి



కాన్ఫరెన్స్‌కు హాజరైన ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, కంపెనీ డీసీఓలు, ఎంఐ ఇంజినీర్లు

అనంతపురం అగ్రికల్చర్: అర్హత ఉన్న ప్రతి రైతుకూ రాయితీ డ్రిప్, స్ప్రింక్లర్లు అందించాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు ఆఫీసర్ (పీఓ) సీబీ హరినాథరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి ఏపీఎంఐపీ జిల్లా పీడీ జి.ఫిరోజ్‌ఖాన్, కంపెనీ డీసీఓలు, ఎంఐ ఇంజినీర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఏడాది జిల్లాకు 12,500 హెక్టార్ల లక్ష్యం ఇచ్చామని, అవసరమైతే అదనపు కేటాయింపులకు సిద్ధంగా ఉన్నందున సాధ్యమైనంత వేగంగా పథకం అమలు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్లు కొనసాగిస్తూనే డ్రిప్, స్ప్రింక్లర్ల అవసరం ఎక్కువగా ఉన్న రైతులను గుర్తించి వారికి త్వరితగతిన మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

టీచర్ల బదిలీలకు 26 వరకు దరఖాస్తు

రాప్తాడు రూరల్: ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ టీచర్ల బదిలీలకు సంబంధించి ఈ నెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ తెలిపారు. బదిలీల షెడ్యూలును మంగళవారం ఆయన వెల్లడించారు. ఈ నెల 25 నుంచి 27 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. 28, 29 తేదీల్లో ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలు విడుదల చేస్తామన్నారు. జాబితాపై అభ్యంతరాలుంటే 30న స్వీకరిస్తామన్నారు. 31, జూన్ 1 తేదీల్లో అభ్యంతరాలను పరిశీలిస్తామన్నారు. జూన్ 2, 3 తేదీల్లో వెబ్‌సైట్‌లో అర్హత పాయింట్లతో పాటు ఫైనల్ సీనియారిటీ జాబితాలు పొందుపరుస్తామన్నారు. 4న ఖాళీలు ప్రకటిస్తామన్నారు. 5 నుంచి 8వ తేదీ వరకు హెచ్ఎంలు, టీచర్లు ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చుకోవచ్చన్నారు. 9 నుంచి 11వ తేదీ వరకు జాబితా తయారు చేస్తామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకే పాఠశాలలో ఐదు విద్యా సంవత్సరాల సర్వీసు పూర్తయిన ప్రధానోపాధ్యాయులు, 8 విద్యా సంవత్సరాలు పూర్తయిన ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రీ- అప్పోర్షన్మెంట్ మేరకు సర్‌ప్లస్ అయిన ఉపాధ్యాయులు, సబ్జెక్టు కన్వర్షన్ అయిన పాఠశాల సహాయకులందరూ తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అసంబద్ధమైన, తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంటర్ విద్యార్థుల కోసం కంట్రోల్ రూమ్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి జూన్ 1 వరకు జరగనున్నాయని కలెక్టర్ గౌతమి తెలిపారు. పరీక్షలు రాయనున్న విద్యార్థుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఏదేని సమాచారం లేదా ఫిర్యాదును 08554- 220009 నంబర్‌కు ఫోన్ చేసి తెలపవచ్చన్నారు. పరీక్షలు ప్రారంభమైన రోజు నుంచి ముగిసే రోజు వరకు కంట్రోల్ రూమ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు.

స్కానింగ్ సెంటర్లపై ఉక్కుపాదం

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: జిల్లాలో లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి సలహా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో నిరంతర తనిఖీలు నిర్వహించాలన్నారు. చట్ట విరుద్ధంగా పనిచేసే వాటిపై పక్కా ఆధారాలతో కేసు నమోదు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లు, వాటి నిర్వహణపై వారంలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీ సమావేశాలు ప్రతి నెల తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల వివరాలను సచివాలయాల వారీగా అందించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్పెషల్ సెషన్స్ (పోక్సో) జడ్జి స్వరాజ్యం, డీఎంహెచ్ఓ వీరబ్బాయి, పీసీపీఎన్‌డీటీ చట్టం నోడల్ అధికారి యుగంధర్, ఆర్డీఓలు మధుసూదన్, రవీంద్ర, డీసీహెచ్ఎస్ కృష్ణవేణి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు అరికట్టండి

జిల్లాలో ప్రభుత్వ భూముల ఆక్రమణను అరికట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూసేకరణ అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. పేదలకు ఇళ్ల స్థలాలు, పరిశ్రమలు, రోడ్ల విస్తరణ తదితర వాటికి భూములు అవసరమన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. 544డీ జాతీయ రహదారికి భూమిని సేకరించి జూలైలోగా జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించాలన్నారు. రాయదుర్గం పట్టణంలో చేపడుతున్న బెంగళూరు- తుమకూరు- రాయదుర్గం రైల్వే లైను నిర్మాణానికి త్వరితగతిన భూసేకరణ పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ ఎదుట రోడ్డు ఫినిషింగ్, బ్యూటిఫికేషన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. 'అహుడా' ఎంఐజీ లే అవుట్ల పనులు పూర్తి చేసి.. కొనుగోలుదారులకు స్థలాలు అందించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జడ్జి స్వరాజ్యం

సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యమెందుకు?

కూడేరు: తాగునీటి ప్రాజెక్టులు, పైపులైన్ పనుల్లో సమస్యలు తలెత్తినపుడు వెంటనే పరిష్కరించకుండా ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని అధికారులు, కాంట్రాక్టర్లపై కలెక్టర్ గౌతమి మండిపడ్డారు. మంగళవారం మండల పరిధిలోని పీఏబీఆర్‌ను కలెక్టర్ పరిశీలించారు. తొలుత సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్‌ను పరిశీలించి, అపరిశుభ్రంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మొరాయించిన మోటర్ల స్థానంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మోటర్లను పరిశీలించారు. ప్రాజెక్ట్ నుంచి ఏయే గ్రామాలకు నీరు సరఫరా అవుతోందో అడిగి తెలుసుకున్నారు. మోటర్లు మొరాయించి 15 రోజులుగా గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయినా పట్టించుకోరా అంటూ కాంట్రాక్టర్లు, అధికారులకు చివాట్లు పెట్టారు. అనంతరం శ్రీరామిరెడ్డి, ఉరవకొండ, కూడేరు ప్రాజెక్టులను పరిశీలించారు. సమన్వయంతో పని చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దండి

పీఏబీఆర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ నారాయణరెడ్డి కలెక్టర్‌ను కలిసి కోరారు. పార్కు ఏర్పాటుకు 7 ఎకరాల స్థలం సిద్ధంగా ఉందన్నారు. ధర్మవరం కుడి కాలువకు నీటిని విడుదల చేసే గేట్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. కూడేరు ప్రాజెక్ట్‌కు ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేసి ప్రజలకు సక్రమంగా తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, ఈఈ జవహర్‌కుమార్, డీఈ షఫ్రీన్, సత్యసాయి ప్రాజెక్ట్ డీఈ రామారావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, డీఈ పక్కీరప్ప, తహసీల్దార్ సక్సేనా, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

వేలిముద్ర పడని కార్డుదారులకు శుభవార్త

- ఐరిస్ ఆధారిత ధ్రువీకరణతో రేషన్ సరుకుల పంపిణీ
- ఎండీయూ వాహనాల నిర్వాహకులకు మిషన్ల అందజేత
- జూన్ నుంచి అమలు

అనంతపురం అర్బన్: కార్డుదారులందరికీ బియ్యం, నిత్యావసర సరుకులు వందశాతం అందాలనేది ప్రభుత్వ ఆశయం. అయితే ఈ-పాస్ యంత్రంలో వీరి వేలిముద్రలు పడని కారణంగా బియ్యం, నిత్యావసర సరుకులు కొందరు కార్డుదారులకు అందడం లేదు. ముఖ్యంగా కూలి పనులు చేసుకునేవారి వేలిముద్రలు అరిగిపోయి ఉంటాయి. ఇక వృద్ధులు, కొందరు వ్యాధిగ్రస్తుల అరిచేతుల, వేళ్లు ముడతలుపడి ఉంటాయి. దీంతో ఈ-పాస్ యంత్రంలో (బయోమెట్రిక్) ఇలాంటి వారి వేలిముద్రలు పడవు. ఈ సమస్యకు ప్రభుత్వం చెక్‌పెడుతూ జూన్ నెల నుంచి ఐరిస్ ఆధారిత ధ్రువీకరణతో సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లాకు 405 ఐరిస్ యంత్రాలను మంజూరు చేసింది.

రెవెన్యూ డివిజన్ వారీగా యంత్రాలు

ఇంటి వద్దకే రేషన్ అందించే ఎండీయూలు (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలు జిల్లావ్యాప్తంగా 405 ఉన్నాయి. ఒక్కొక్క వాహనానికి ఒక ఐరిస్ యంత్రాన్ని ఇస్తారు. ఎండీయూల సంఖ్య మేరకు అనంతపురం రెవెన్యూ డివిజన్‌కు 173, గుంతకల్లుకు 123, కళ్యాణదుర్గానికి 109 కేటాయించారు. రెవెన్యూ డివిజన్ వారీగా ఎండీయూ వాహనాల నిర్వాహకులకు ఐరిస్ యంత్రాలు అందించే కార్యక్రమాన్ని జిల్లా సరఫరాల శాఖ ప్రారంభించింది.



ఎండీయూ నిర్వాహకులకు ఐరిస్ యంత్రాలను అందజేస్తున్న డీఎస్ఓ శోభారాణి

ఎండీయూ నిర్వాహకులకు అందజేత

అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని 173 ఎండీయూ నిర్వాహకులతో డీఎస్ఓ శోభారాణి సమావేశం నిర్వహించారు. ఐరిస్ యంత్రాల వినియోగం గురించి అవగాహన కల్పించారు. అనంతరం నిర్వాహకులకు ఐరిస్ యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఓ శోభారాణి, సీఎస్‌డీటీలు దుర్గాప్రసాద్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

బదిలీల కోసం దరఖాస్తుల వెల్లువ

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జెడ్పీ పరిధిలో 401 ఖాళీలు
- ఐదేళ్ల సర్వీసు పైబడిన ఉద్యోగులు 120 మంది
- 2 నుంచి 5 ఏళ్లలోపు సర్వీసు కలిగిన వారు 293 మంది

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలో బదిలీల కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఎంపీడీఓలు మొదలుకొని కార్యాలయ సబార్డినేట్ల వరకు మొత్తం 1,317 పోస్టులకు గాను 922 మంది పని చేస్తున్నారు. 401 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఐదేళ్ల ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న వారు 120 మంది ఉండగా, 2 నుంచి 5 సంవత్సరాలలోపు ఒకే చోట సర్వీసు కలిగిన వారు 293 మంది ఉన్నట్లు జెడ్పీ అధికారులు మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.

చిగురించిన ఆశలు : బదిలీల ప్రక్రియ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు కచ్చితంగా బదిలీ కావాలని ఆదేశించింది. రెండేళ్ల సర్వీసు పూర్తయిన వారు రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది.

ఉద్యోగుల సందడి : జిల్లా, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, పంచాయతీరాజ్ శాఖ, ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ), క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో డిప్యుటేషన్లపై పని చేస్తున్న ఉద్యోగుల్లో సందడి నెలకొంది. తాము కోరుకున్న ప్రాంతానికి బదిలీ కావాలని చాలా రోజుల నుంచి ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు వారికి ఆశలు నెరవేరే అవకాశం లభించింది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖాళీలను పరిశీలిస్తే..

హోదా	మంజూరైన పోస్టుల సంఖ్య	ఖాళీలు	ఐదేళ్ల సర్వీసు కలిగిన వారు	2-5 ఏళ్ల సర్వీసు కలిగిన వారు
ఎంపీడీఓ	63	25	01	15
ఏఓలు	74	03	--	30
ఎస్ఏలు	120	02	04	37
జేఏలు	242	05	08	64
టైపిస్టులు	91	26	01	30
రికార్డ్ అసిస్టెంట్లు	203	41	46	35
ల్యాబ్ అసిస్టెంట్లు	63	20	14	07
లైబ్రరీ అసిస్టెంట్లు	02	01	01	00
ఆఫీస్ సబార్డినేట్లు	459	278	45	75
మొత్తం	1317	401	120	293

క్లుప్తంగా

మామిడి చెట్లు నరికివేత



శింగనమల: మండలంలోని సలకంచెరువులో రైతు సూరికి చెందిన పొలంలో 18 మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. నాలుగేళ్ల క్రితం తన పొలంలో వంద మామిడి మొక్కలను రైతు సూరి నాటాడు. అందులో 40 మొక్కలు బతికాయి. ప్రస్తుతం కాపు నిలిపే సమయంలో 18 చెట్లను నరికివేయడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ బాలకృష్ణయ్య తెలిపారు.

ధాన్యం కొనుగోలులో దళారుల మోసం



చెక్కత్రాసును పరిశీలిస్తున్న తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ శంకర్

కణేకల్లు: రైతుల అమాయకత్వాన్ని దళారులు సొమ్ము చేసుకుంటున్నారని, అధిక తూకాలతో దగా చేస్తున్నారని గుంతకల్లు డివిజన్ తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టలర్ శంకర్, టెక్నికల్ అసిస్టెంట్ ప్రకాష్ తెలిపారు. మంగళవారం వారు కణేకల్లు మండలంలో పర్యటించారు. గంగలాపురం వద్ద రెండు ప్రాంతాల్లో చెక్క త్రాసును ఉపయోగించి దళారులు ధాన్యం కొనుగోలు చేస్తుండడాన్ని పరిశీలించారు. అనంతరం ఆ బస్తాలను ఎలక్ట్రానిక్ త్రాసుపై తూకం వేయిస్తే ఒక్కో బస్తాకు 4 కిలోల వరకు అదనంగా ధాన్యం నింపిన విషయం వెలుగు చూసింది. చెక్కత్రాసులోని పాత తూకం రాళ్ల లోపలి వైపు ఇనుపముక్కలున్న విషయాన్ని గుర్తించారు. రైతులను మోసం చేసిన దళారులు వెంకటేశులు, భీమలింగప్పకు రూ.14వేలు జరిమానా విధించారు. ధాన్యం కొనుగోళ్లకు చెక్క త్రాసులు వినియోగించరాదని హెచ్చరించారు.

న్యూరో సర్జరీ... సేవలు లగ్జరీ

- అత్యంత ఖరీదుతో కూడుకున్న సర్జరీలు పూర్తి ఉచితం
- గతంలో కర్నూలు, బెంగళూరు, హైదరాబాద్‌లకు వెళ్లే పరిస్థితి
- ఏడాదిలో 150 సర్జరీలు చేసిన న్యూరో సర్జరీ విభాగం
- మొత్తం 420 మందికి కార్పొరేట్ స్థాయి సేవలు



అనంతపురంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

అనంతపురం క్రైం: గత ప్రభుత్వ హయాంలో తలకు చిన్నపాటి గాయంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వస్తే ప్రాణాలు గాలిలో దీపమయ్యేవి. ప్రత్యేక న్యూరో విభాగానికి నిష్ణాతులైన వైద్యులు, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కేసులన్నీ కర్నూలు, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు రెఫర్ చేసేవారు. ఈ క్రమంలో ఎందరతో మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగన్ తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలతో వైద్య రంగానికి నూతన జవసత్వాలు చేకూరాయి. దీంతో అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో స్పెషలిస్టు వైద్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో జిల్లా ప్రజలతో పాటు కడప, కర్నూలు, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడకు తరలి వచ్చి నాణ్యమైన చికిత్సలు పొందుతున్నారు. ఈ క్రమంలో రూ.లక్షలతో కూడుకున్న శస్త్రచికిత్సలను సైతం న్యూరో విభాగంలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

మౌలిక సదుపాయాలు పుష్కలం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో న్యూరో సర్జరీ విభాగానికి ఆధునాతన మౌలిక సదుపాయాలు సమకూరాయి. దాదాపు రూ.5 కోట్లు విలువ చేసే అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. రూ.3 కోట్లు విలువ చేసే జైస్(జెడ్ఈఐఎస్ఎస్) మైక్రో, రూ.25 లక్షల విలువ చేసే సీ యామ్ మిషన్, రూ.18 లక్షలు విలువ చేసే మైక్రో మోటార్ డ్రిల్, రూ.4 లక్షలు విలువ చేసే స్కల్ ఫ్రేమ్, రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు మాడ్యులర్ థియేటర్లు, రూ.50 లక్షలు విలువ చేసే 30 రకాల ఆపరేషన్ సాధనాలున్నాయి. వీటితో పాటు మైక్రో సర్జరీలకు ఉపయోగపడే పరికరాలను పలు స్వచ్ఛంద సంస్థలు అందించాయి.

150 సర్జరీలు విజయవంతం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని న్యూరో సర్జరీ విభాగంలో 2022, ఏప్రిల్ 18 నుంచి ఓపీ సేవలు మొదలయ్యాయి. అదే ఏడాది జూన్ 1 నుంచి ఐపీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అదే ఏడాది నుంచి జీజీహెచ్‌లోని ఆర్థో ఓటీలో న్యూరో సర్జరీలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమ, గురువారాల్లో ఓపీ సేవలు, మంగళ, బుధ, శుక్రవారాల్లో సర్జరీలు జరిగేల న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాదికాలంలో డాక్టర్ భాస్కర్ నేతృత్వంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్‌బాబు 150 సర్జరీలను ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా చేశారు. మొత్తం 420 మందికి ప్రత్యేక వైద్యం అందజేశారు.

చిన్న గాటుతోనే సర్జరీలు



గతంలో లాగా హెడ్, స్పైన్ సర్జరీలకు పెద్ద కోతలు అవసరం లేదు. చిన్నగాటుతో మైక్రో సర్జరీలు విజయవంతంగా చేస్తున్నాం. ఒక్క రోజులోనే రోగి కోలుకుంటున్నాడు. తక్కువ సమయంలోనే శస్త్రచికిత్స పూర్తవుతుంది. ఈ తరహా శస్త్రచికిత్సలు ఇప్పటి వరకూ బెంగళూరు, హైదరాబాద్‌లాంటి ప్రాంతాల్లోనే చేసేవారు. ప్రముఖ నగరాలు, పట్టణాల్లో ఫెయిల్ అయిన కేసులను సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుని సర్జరీతో ప్రాణాలు నిలపడం మాకెంతో ఆనందాన్నిస్తోంది. రోగుల్లో నమ్మకాన్ని పెంచేలా మా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, స్టాఫ్ నర్సులు, ఓటీ టెక్నీషియన్లు అంకితభావంతో పని చేయడం గర్వకారణం.

– డాక్టర్ జి.భాస్కర్, న్యూరో సర్జరీ విభాగాధిపతి, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, అనంతపురం

మహనీయుల అడుగుజాడలే శిరోధార్యం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- ఎస్కేయూ వేదికగా సత్యసాయి, విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ ప్రారంభం





బ్యాటింగ్ చేసి మ్యాచ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, వీసీ ఎం.రామకృష్ణారెడ్డి

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధికి, పీడిత ప్రజల అభ్యున్నతికి విశిష్ట సేవలు అందించిన మహనీయులు సత్యసాయిబాబా, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అడుగుజాడలే తనకు శిరోధార్యమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా ప్రజల దాహార్తిని తీర్చిన సత్యసాయిబాబా, సాగునీటి వనరుల పెంపుతో పాటు నిరుపేదల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సాగునీరు తీసుకొచ్చిన డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిను స్మరించుకోకుండా జిల్లాలో ఏ కార్యక్రమాన్ని చేపట్టలేమన్నారు. అలాంటి మహనీయుల పేరిట క్రికెట్ టోర్నీ నిర్వహించడం గర్వకారణమన్నారు. ఎస్కేయూ వేదికగా వర్సిటీ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలసి ముఖ్యఅతిథిగా హాజరై మంగళవారం క్రికెట్ టోర్నీని ప్రారంభించి, మాట్లాడారు. టోర్నీలో మొత్తం 162 జట్లు పాల్గొన్నాయి. ప్రిలిమినరీ పోటీలను రాప్తాడు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. సెమీఫైనల్, ఫైనల్ పోటీలు మాత్రం ఎస్కేయూ క్రీడా మైదానంలో జరుగుతాయి. విజేత జట్టుకు రూ.1.20 లక్షలు, రన్నర్ జట్టుకు రూ.60 వేలు, మూడో స్థానంలో నిలిచే జట్టుకు రూ.30 వేలు, నాల్గో స్థానంలోని జట్టుకు రూ.15 వేలను ప్రోత్సాహకంగా అందజేయనున్నారు. తొలిరోజు ఆకుతోటపల్లి– చిన్నంపల్లి జట్ల మధ్య మ్యాచ్‌ను వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఎస్పీ శ్రీనివాసరావు టాస్ వేశారు. ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, కంప్యూటర్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.రఘునాథరెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎంవీ శ్రీనివాసన్, పీఆర్వో డాక్టర్ కె.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మినిమం స్కేలు ఉద్యోగులకు దన్ను

వర్సిటీలో పనిచేస్తున్న మినిమం స్కేలు ఉద్యోగులను టైం స్కేలు ఉద్యోగులుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సీఎం కార్యాలయానికి గతంలో విన్నవించడంతో పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని వర్సిటీ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం కోరిందన్నారు. మినిమం స్కేలు ఉద్యోగులకు దన్నుగా నిలవాలని వీసీని సభాముఖంగా కోరారు.

ఈ నెలాఖరుకు పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు

- రాష్ట్ర పాఠశాల పాఠ్యపుస్తకాల బోర్డు డైరెక్టర్ లక్ష్మీనారాయణ



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

ఉరవకొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెలాఖరులోపు అన్ని పాఠశాలలకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర పాఠశాల పాఠ్యపుస్తకాల బోర్డు డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. మంగళవారం ఆయన ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పాఠ్యపుస్తకాలు నిల్వ చేసిన గోదామును పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 80 శాతం మేర పాఠ్య పుస్తకాలను ఆయా మండలాలకు చేర్చినట్లు తెలిపారు. ఉరవకొండ మండలానికి సంబంధించి 1,13,426 పాఠ్యపుస్తకాలు అవసరం కాగ, 35,544 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన పుస్తకాలు వారం రోజుల్లోపు చేరుతాయన్నారు. 10వతరగతి పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండగా.. 6, 7, 9 తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలు అందాల్సి ఉందన్నారు. నోట్ బుక్కులు సైతం కొంత మేర రావాల్సి ఉందన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభానికే ముందే ప్రభుత్వం పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, వైఎస్పీ ఏపీఎం గంగన్న స్టాక్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

14వేల గృహ నిర్మాణాల పూర్తి

- గృహ నిర్మాణ సంస్థ పీడీ కేశవనాయుడు

అనంతపురం టౌన్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా మే నెల లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కేశవనాయుడు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 68 వేల గృహ నిర్మాణాలను ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. మే నెలలో 13వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటికే 14వేల గృహ నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మరో 20 వేల గృహాలు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయని, మూడు వేల ఇళ్లకు రూఫ్ లెవల్ పూర్తయిందని వివరించారు. ఈ లెక్కన ఈ నెలాఖరుకు మరో వెయ్యి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

కారు బోల్తా - ఒకరి మృతి



మృతుడు వలీబాషా

ధర్మవరం రూరల్: ప్రమాదవశాత్తు కారు బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగరానికి చెందిన ఆటో డ్రైవర్ వలీబాషా (48), కారు డ్రైవర్ చంద్రశేఖర్, లిల్లీబాబా సొంత పనిపై హిందూపురానికి వెళ్లి మంగళవారం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ధర్మవరం మండలం సీతారాంపల్లి వద్దకు చేరుకోగానే టైరు పేలడంతో కారు పల్టీలు కొడుతూ రోడ్డు పక్కనే గుంతలోకి దూసుకెళ్లింది. వలీబాషా అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన చంద్రశేఖర్, లిల్లీబాబాను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు సమాచారం. ఘటనపై ధర్మవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుకు వ్యక్తి మృతి



రాముడు (ఫైల్)

కణేకల్లు: పాము కాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. కణేకల్లు మండలం జక్కలవడికి గ్రామానికి చెందిన మురడి రాముడు (45), హనుమక్క దంపతులు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. పిల్లలిద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. రెండు పాడి ఎనుములు పెంచుతూ పాల విక్రయంతో జీవనం సాగిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఎనుములకు మేపు కోసం బయలు ప్రాంతానికి తోలుకెళ్లినప్పుడు రాముడిని పాము కాటేసింది. కుటుంబసభ్యులు వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు.

పశుశాఖలో బదిలీలు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖలో బదిలీల పర్వం మొదలైంది. మంగళవారం స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా అధికారులు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ శుభదాస్ సమక్షంలో ఆఫీస్ సబార్డినేటర్లు, వెటర్నరీ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండు జిల్లాల పరిధిలో 15 మంది ఆఫీస్ సబార్డినేటర్లు, ఒక వెటర్నరీ అసిస్టెంట్‌కు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. మిగిలిన విభాగాల్లో ఆప్షన్ల ప్రక్రియ కొనసాగుతోంది.

ఆలయంలో హుండీ అపహరణ

పెద్దపప్పూరు: మండలంలోని సుంకేసులపల్లి, కుమ్మెత గ్రామాల మధ్య ఉన్న ఇటీవల నిర్మించిన గంగమ్మ ఆలయంలో హుండీని ఆగంతకులు ఎత్తుకెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున దుండగులు ఆలయంలోకి చొరబడి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం హుండీని ఎత్తుకెళ్లి పొలాల్లో ధ్వంసం చేసి, అందులోని భక్తుల కానుకలను అపహరించుకెళ్లారు. సుంకేసులపల్లి గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'జగనన్న ఆణిముత్యాలు' వాయిదా

రాప్తాడు రూరల్: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'జగనన్న ఆణిముత్యాల అవార్డులు' ప్రదానోత్సవం కార్యక్రమం వాయిదా పడింది. ఈ మేరకు డీఈఓ ఎం.సాయిరామ్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తదుపరి తేదీని ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుందన్నారు.

హిజ్రాలకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయండి

- ఏపీ సాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ కామేశ్వరప్రసాద్

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చే హిజ్రాల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావును ఏపీ సాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ ఆదేశించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన జీజీహెచ్‌లోని ఐసీటీసీ సెంటర్‌ను తనిఖీ చేశారు. హెచ్ఐవీ పరీక్షలు, బాధితులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారి పట్ల సానుకూల ధోరణితో వ్యవహరించాలని సూచించారు. విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వన్‌స్టాప్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, డీపీఎం వెంకటరత్నం, సూపర్‌వైజర్ రమణ తదితరులున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి:

పీహెచ్‌సీ, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవందించాలని సంబంధిత వైద్యాధికారులను డాక్టర్ కామేశ్వరప్రసాద్ ఆదేశించారు. అనంతపురం నగర శివారులోని రాజీవ్‌కాలనీ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, కురుకుంట పీహెచ్‌సీలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. హెల్త్ క్లినిక్‌లకు వచ్చే రోగులకు చేపట్టే వైద్య పరీక్షలు, మందుల స్టాక్‌పై ఆరా తీశారు. సీహెచ్‌ఓలకు అందించే శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్, సీహెచ్ఓలు ఉన్నారు.

ప్రతి విద్యార్థికీ యూనిఫాం అందాలి



దుస్తుల నాణ్యతను పరిశీలిస్తున్న సీఈఓ భాస్కరరెడ్డి

ఉరవకొండ: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికీ ప్రభుత్వం అందజేసిన యూనిఫాం, బూట్లు అందజేయాలని మండల విద్యాశాఖాధికారులను జిల్లా పరిషత్ సీఈఓ భాస్కరరెడ్డి ఆదేశించారు. ఉరవకొండలోని ఎస్కే ప్రభుత్వ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాం దుస్తుల నాణ్యతను పరిశీలించారు. ఈ ఏడాది విద్యార్థులకు మరింత ఆకర్షణీయమైన యూనిఫాం దుస్తులు పంపిణీ చేసిందన్నారు. ఒక్కో విద్యార్థికి మూడు జతలకు సరిపడ యూనిఫాం దుస్తులతో పాటు షూస్, బెల్ట్, టైను తల్లిదండ్రులకు అందజేస్తారని, దుస్తుల కుట్టు కూలిని ఆయా విద్యార్థుల తల్లుల ఖాతాలోకి ప్రభుత్వం నేరుగా చేస్తుందని తెలిపారు. సీఈఓ వెంట ఎంపీడీఓ చంద్రమౌళి ఉన్నారు.

'నాడు- నేడు' పనులు జూన్ 12లోపు పూర్తి కావాలి

రాప్తాడురూరల్: మనబడి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులు జూన్ 12 నాటికి పూర్తి కావాలని ఎంఈఓలను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.సాయిరామ్ ఆదేశించారు. నాడు – నేడు పనులపై జిల్లా సైన్స్ సెంటర్‌లో ఎంఈఓలతో మంగళవారం ఆయన సమీక్షించారు. నిర్ణీత గడువులోపు నాడు–నేడు పనులు పూర్తి చేయాలన్నారు. ఈ బాధ్యతను ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా స్వీకరించేలా చేయాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందించాలన్నారు. ఫెయిల్ అయిన పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను తనిఖీ చేసి ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ స్కూల్ పిల్లల్లో ఐదేళ్లు పూర్తయిన వారిని గుర్తించి ప్రైమరీ స్కూళ్లల్లో చేర్పించేలా చర్యలు తీసుకోలన్నారు. అలాగే ప్రైమరీ స్కూల్స్‌లో 5వ తరగతి పూర్తయిన విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం జగనన్న ఆణిముత్యాల అవార్డులకు సంబంధించిన ఆహ్వానపత్రాలు, కరపత్రాలను ఎంఈఓలకు అందజేశారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, డీవైఈఓలు పద్మప్రియ, శంకరప్రసాద్ పాల్గొన్నారు.

కుమారులకు పెళ్లి కాలేదని బలవన్మరణం



మృతుడు శ్రీనివాసరెడ్డి

తాడిపత్రి: కుమారులిద్దరికీ పెళ్లి కాలేదన్న బెంగతో ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం చిన్నపల్లికి చెందిన కొండారెడ్డి గారి శ్రీనివాసరెడ్డి (55), లలిత దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి వివాహ వయసు దాటిపోతున్నా సంబంధాలు కుదరకపోవడంతో ఇక తన బిడ్డలకు పెళ్లి కాదని శ్రీనివాసరెడ్డి బాధపడేవాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాసరెడ్డి సోమవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు ఇంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు తాడిపత్రి రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆస్పత్రి ఆవరణలో ప్రసవం

- నవజాత శిశువు మృతి
- బాలింత క్షేమం



లేబర్ వార్డులో అడ్మిషన్‌లో ఉన్న షబాన

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మంగళవారం అప్పుడే పుట్టిన ఓ శిశువు మృతి చెందింది. ప్రసవ వేదనతో గర్భిణి ఆస్పత్రి ఆవరణలో ప్రసవించడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, ఎస్ఎన్‌సీయూ వైద్యులు డాక్టర్ దినకర్, సెక్యూరిటీ సిబ్బంది తెలిపిన మేరకు.. గుంతకల్లుకు చెందిన రాజా, షబానా దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మూడో కాన్పు కోసం షబానా అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేరారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు తన ఇద్దరు పిల్లలతో కలసి ఆస్పత్రి ఆవరణలోని ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహం ఎదురుగా ఉన్న బల్లపై ఆమె కూర్చొని ఉండగా పురిటి నొప్పులు మొదలయ్యాయి. విషయాన్ని గమనించిన అక్కడున్న వారందరూ గుమిగూడేలోపు గర్భం నుంచి బాబు నేలపై పడ్డాడు. విషయం తెలుసుకున్న డాక్టర్ పద్మజ వెంటనే ఎఫ్ఎన్ఓల సాయంతో షబానాను లేబర్ వార్డుకు తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న పసికందు(బాబు)ను ఎస్ఎన్‌సీయూలో చేర్చి, డాక్టర్ దినకర్ పర్యవేక్షణలో అత్యవసర చికిత్స చేపట్టారు. అయితే చికిత్సకు స్పందించక బాబు మృతి చెందాడు. నెలలు పూర్తి స్థాయిలో నిండకనే ప్రసవమైందని, నవజాత శిశువు కిలో బరువు మాత్రమే ఉన్నాడని వైద్యులు నిర్ధారించారు. షబానా తరఫున పద్మావతి అనే మహిళ వచ్చి పసికందు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బిడ్డను కోల్పోవడంతో షబానా కన్నీటిపర్యంతమైంది.

క్లుప్తంగా

పర్యావరణ ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రాప్తాడురూరల్: అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యువజన జాగృతి సొసైటీ, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం 'మిషన్ లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో మిషన్ లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రకృతిపై సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రకృతి పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. యువజన జాగృతి సొసైటీ అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి సామాజిక బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ చంద్రమోహన్, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని అదనపు సమావేశపు హాల్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 40, 73వ సచివాలయ పరిధిలోని 270 మంది వలంటీర్లకు సేవామిత్ర, వజ్ర, రత్న అవార్డులు అందించనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న కోగటం విజయభాస్కరరెడ్డి

అనంతపురం కల్చరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పలువురు అధికారులు సూచించారు. మంగళవారం రెవెన్యూ కాలనీలోని వివేకానంద యోగా కేంద్రంలో ఉచిత మెడిటేషన్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, రామచంద్ర మిషన్ సహకారంతో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మెళవాయి రాజశేఖరరెడ్డి అధ్యక్షత వహించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, అడిషనల్ ఎస్పీ హనుమంతు, ఫారెస్టు అధికారి దామోదర్‌రెడ్డి, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి గురుస్వామిశెట్టి, యోగా సంస్థల ప్రతినిధులు మధుసూదన్, అబ్బా టీవీ డాక్టర్ హరిప్రసాద్ తదితరులు ఆత్మీయ అతిథులుగా పాల్గొన్నారు. యోగా విశిష్టతపై వివరించారు. ఈనెల 24,25 తేదీల్లో ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు ఉచిత యోగా, మెడిటేషన్ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో యోగా గురువులు దివాకర్, మారుతీప్రసాద్, కృష్ణవేణి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులపై నిర్లక్ష్యం



చిన్న బండపై పడుకున్న గర్భిణి

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని లేబర్ వార్డులో వైద్యురాళ్ల నిర్లక్ష్యం గర్భిణులకు శాపంగా మారుతోంది. మంగళవారం లేబర్ వార్డుకు ప్రసవానికి వచ్చిన గర్భిణులను వైద్యులు ఆరుబయట ఉన్న బండలపై కూర్చోబెట్టారు. గర్భిణులు బండలపైనుంచి కిందపడితే ప్రాణాలకే ప్రమాదం. వార్డులోనే ఉంచి సేవలందించాలని పలువురు కోరుతున్నారు.

పారిశుధ్య పనుల నిర్వహణపై సంతృప్తి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న సీఈఓ, డీపీఓ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనుల నిర్వహణ బాగుందని జిల్లా పరిషత్ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం పంచాయతీలో 'స్వచ్ఛ సర్వేక్షన్' కార్యక్రమం అమలును పరిశీలించారు. కక్కలపల్లి మెయిన్ విలేజ్, ఇందిరమ్మ కాలనీ, కళావతమ్మ కాలనీలలో పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. రోడ్ల నిర్వహణ, ట్యాంకుల పరిశుభ్రత, డ్రైనేజీల నిర్వహణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాన్ని పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఈఓఆర్డీ అలివేలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు జూటూరు పెన్నోబులేసు, ఉప సర్పంచ్ బండి రమేష్, నాయకులు కల్లుమడి శ్రీనివాసులు, గాండ్ల ఆదినారాయణ, గాండ్ల బయప్ప తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కష్టాన్ని తెలియజేయండి

- 'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

రాప్తాడురూరల్: ఎన్ని ఇబ్బందులున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నారు.. ఆయన కష్టాన్ని ప్రజలకు వివరించాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పార్టీ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులకు పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం ఏర్పాటు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అనుభవం ఉన్న చంద్రబాబు ఇన్ని సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయలేక పోయారని ప్రశ్నించారు. ఆయన అధికారంలోకొచ్చే నాటికి రూ. 40 వేల కోట్లు అప్పులుంటే దిగిపోయే నాటికి రూ. 3 లక్షల కోట్లకు చేరిందన్నారు.

రాప్తాడు నియోజకవర్గంలో ప్రతిపక్షం లేదు..

దురదృష్టవశాత్తూ నియోజకవర్గంలో ప్రతిపక్షం లేదని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వంలో అందినకాటికి దోచుకుని వెళ్లిపోయారన్నారు. ఎందుకు ఓడించారనే ఆత్మ విమర్శ చేసుకోలేదన్నారు. అధికారంలోకొస్తే మంచిపనులు చేసి ప్రజలకు సేవలందించి దగ్గర వ్వాలని చూడాలి కానీ.. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దోపిడీ చేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతపురం రూరల్ మండలంలో 5 వేల మందికి పట్టాలిస్తామన్నారు. కక్కలపల్లికాలనీ, పాపంపేట, అక్కంపల్లి, కురుగుంట, రాచానపల్లి పంచాయతీల్లో ప్రతి ఇంటికీ పీఏబీఆర్ నుంచి తాగునీటిని అందిస్తామన్నారు. ఇప్పటికే టెండర్లు కూడా పిలిచారని, జలజీవన్ మిషన్ కింద పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు రూ.38 కోట్లతో టెండర్లు పిలిచారన్నారు. ఆత్మకూరు నుంచి పాపంపేట వరకు రూ. 27 కోట్లతో టెండర్లు పిలిచారన్నారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాలకు రూ.33 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటున్నారన్నారు. అనంతరం సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులు అందించి, సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మీ, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, బీసీ సెల్ నాయకులు ధనుంజయ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగు మర్రి గోవిందరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మతం శ్యాంసుందర్, ఎంపీటీసీ సభ్యులు వడ్డే శీనా, వెంకటేశ్వర్లు, సందీప్, మౌనిక, సర్పంచ్ తేజేశ్వణి, ఎంపీడీఓ బాబాఫకృద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు, పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు అశోక్‌బాబు, మహేంద్ర, బాలచంద్రారెడ్డి, స్థానిక నాయకులు మాదన్నయాదవ్, అపర్ణ, గోపాల్‌రెడ్డి, ఈశ్వరయ్య, గోపి పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- నగరపాలక సంస్థ మేయర్ వసీం



వలంటీర్లను సన్మానిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు

అనంతపురం క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని నగరపాలక సంస్థ మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక సంస్థలోని అదనపు సమావేశ భవనంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. 1 నుంచి 18వ సచివాలయ పరిధిలోని వార్డు వలంటీర్లకు మేయర్ వసీం వివిధ అవార్డులు అందించి, సన్మానించారు. మేయర్ మాట్లాడుతూ కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు అందించిన సేవలు గొప్పవన్నారు. సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.

టీడీపీ హయాంలో తప్పని ప్రదక్షిణలు..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని మేయర్ అన్నారు. తమ ప్రభుత్వంలో ఒకటోతేదీనే వేకువజామునే ఠంఛన్‌గా పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. వలంటీర్ వ్యవస్థ, వలంటీర్ల పనితీరుపై ఇతర రాష్ట్రాల్లోనూ ఆకర్షితులై అక్కడ ఇలాంటి సుపరిపాలనను ఆకాంక్షిస్తున్నారన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో 1,157 మంది వలంటీర్లలో 90 శాతంకుపైగా వలంటీర్లను సన్మానించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నిజాయతీగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరుస్తున్న ప్రతి వలంటీర్ వజ్రమేనని కొనియాడారు. ప్రజలకు సేవచేస్తుంటే ప్రతిపక్షాలు వలంటీర్లపై విష ప్రచారం చేస్తున్నారని, ఎవరూ భయాందోళన చెందాల్సిన పనిలేదన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్థంగా సేవలందించేందుకు ప్రభుత్వం వలంటీర్లకు మంచి అవకాశాన్ని కల్పించిందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు లాలు, ఇస్సాక్, అనిల్‌కుమార్ రెడ్డి, జయలలిత, లావణ్య, రాజేశ్వరి, సుజాత, లక్ష్మీదేవి, దేవి, బాబా ఫకృద్దీన్, రామాంజనమ్మ, బోయ నాగమణి, కోఆప్షన్ సభ్యులు ఉమామహేశ్వరి, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రజలు, ప్రభుత్వానికి వారధులు



రాప్తాడులో వలంటీరుకు అవార్డు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే తలమానికమని, వలంటీర్లు ప్రజలు, ప్రభుత్వానికి వారధులు అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు, అధికారులకు మధ్య వారధిలా వ్యవహరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లు మరింత ఉత్తమ సేవలందించాలన్నారు. మండలంలోని వలంటీర్లకు సేవా రత్న, సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తనను గుండెల్లో పెట్టుకొని, గెలిపించినందుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని చేతల్లో చూపించి అమలు చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వలంటీర్లు పారదర్శకంగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం వారిని సత్కరించి, నగదు పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు.

వలంటీర్లనూ ఎవరూ తొలగించలేరు ..

ప్రజల్లో ప్రజా ప్రతినిధులకు లేని గుర్తింపు వలంటీర్లకు వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో వలంటీర్లను నాయకులుగా మారుస్తామని సీఎం జగన్ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వలంటీర్ల వ్యవస్థ దేశానికి ఆదర్శమని, కరోనా విపత్కర సమయంలోనూ ప్రాణాలకు ఎదురొడ్డి పనిచేశారన్నారు. ప్రధాని మోదీ కూడా 29 రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లోనూ చెప్పారన్నారు. వలంటీర్లను నీవు కాదు కాదా...ఎవరూ తొలగించలేరని చంద్రబాబునుద్దేశించి ఎమ్మెల్యే అన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలు మీపార్టీకి పాడెకట్టడం ఖాయమని అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ మాధవి, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మీ, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలపై అవగాహన



అగ్రి ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రోజా పుష్పలత, విశ్రాంత ఏడీఏ విశ్వనాథ్

అనంతపురం అగ్రికల్చర్: అగ్రికల్చర్ ఇన్‌పుట్స్ డీలర్లు రైతులకు ప్రయోజనం కల్పించేలా అన్నింటా విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబ్-ఎస్‌టీఎల్) ఏడీఏ రోజాపుష్పలత, విశ్రాంత ఏడీఏ విశ్వనాథ్ తెలిపారు. డిప్లమో ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్ఐ) కోర్సు చేస్తున్న జిల్లాకు చెందిన 40 మంది డీలర్ల బృందం ఎస్‌టీఎల్‌తో పాటు వ్యవసాయ అనుబంధ ప్రయోగశాలలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పరీక్ష కేంద్రం, జీవ నియంత్రణ ప్రయోగశాలలను మంగళవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న మట్టి, మందులు, విత్తన పరీక్షలు, విశ్లేషణలపై డీలర్లకు అవగాహన కల్పించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతర ఇన్‌పుట్స్ క్రయ, విక్రయాలు చేసే డీలర్లు వ్యవసాయానికి సంబంధించి విషయ పరిజ్ఞానం పెంచుకుంటే క్షేత్ర స్థాయిలో రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు పెట్టుబడి భారం పెరిగి వ్యవసాయంలో నష్టాలు వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

ఆత్మకూరు: బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సుబ్బర హేమలత అధ్యక్షతన బాల్య వివాహాలు నిరోధించడంపై సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, పంచాయతీ సెక్రటరీలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం వల్ల మాతాశిశు మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రతి పాఠశాలలో బాల్య వివాహాలు, బాలికా సంరక్షణకు అన్నిశాఖలు కలసికట్టుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

జగనన్నకు చెబుదాంతో సమస్యల పరిష్కారం..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో సమస్యలు పరిష్కారమవుతాయని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని స్పందనకు తోడుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9నా ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1902 ఏర్పాటు చేశారని , ఫిర్యాదుదారుడు తన సమస్యను నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లయితే ప్రత్యేక ఐడీ జనరేట్ అవుతుందన్నారు. తద్వారా సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్, డాక్టర్ దయాకర్, ఈవోఆర్డీ సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారమే లక్ష్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు కూడళ్లలో వాహనాల తనిఖీ చేశారు. ప్రధానంగా వాహనదారులు, ఆటోవాలాలు రహదారులపై ఇష్టారాజ్యంగా వాహనాలను నడిపితే చర్యలు తప్పవన్నారు. నిర్దేశిత స్థలాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. ఫ్లాట్‌ఫారం పాదాచారుల కు అనువుగా ఉండేందుకు ఖాళీగా ఉంచాలన్నారు. ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపి, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేతు మరణం తీరని లోటు

అనంతపురం కల్చరల్: సీమ కథకు ఎనలేని ప్రాచుర్యాన్ని కల్పించిన సాహితీ దిగ్గజం కేతు విశ్వనాథరెడ్డి మరణం సాహితీలోకానికి తీరని లోటని విరసం మాజీ సభ్యుడు జెట్టీ జైరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. మా భూమి పత్రికా సంపాదకుడిగా పనిచేసిన సాహితీకృషీవలుడు కేతు విశ్వనాథరెడ్డి అభ్యుదయ రచయితల సంఘానికి చెందిన వారైనా అందరినీ ప్రోత్సహించారన్నారు. కేతు విశ్వనాథరెడ్డి మరణంతో రాయలసీమ గొప్ప కథారత్నాన్ని కోల్పోయిందని సాహిత్యభారతి గౌరవాధ్యక్షుడు డాక్టర్ పతికి రమేష్ నారాయణ విచారం వ్యక్తం చేశారు.

మాన్యం ఆక్రమణల తొలగింపు



ఆంజనేయస్వామి మాన్యంలో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

అనంతపురం కల్చరల్: దేవుడి మాన్యం భూములు ఆక్రమణకు గురికాకుండా అడ్డుకట్ట వేస్తామని, వాటిని ప్రభుత్వానికి అప్పగిస్తామని ఎండోమెంట్ సహాయ కమీషనర్ రామాంజనేయులు అన్నారు. టీవీ టవర్ సమీపంలోని లెనిన్ నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన 6.5 ఎకరాల దేవుని మాన్యం ఉండేది. ఇప్పటికే 5 ఎకరాల భూమి ఆక్రమణలకు గురై కోర్టులో వ్యాజ్యం నడుస్తోంది. మిగిలిన 1.5 ఎకరాల భూమిలోనూ బండలు పాతి ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో జిల్లా సహాయ కమిషనర్ రామాంజనేయులు నేతృత్వంలో ఎండోమెంటు వివిధ ఆలయాల ఈవోలు అడ్డుకొని అక్రమంగా వేయించిన గుడిసెలను జేసీబీతో తొలగించి స్వాధీనం చేసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకొని మాన్యం భూముల ఆక్రమణ చట్టవిరుద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామాంజనేయులు, కార్యనిర్వహణాధికారులు విజయ్‌కుమార్, బీఆర్ వెంకటేశులు, దుర్గాప్రసాద్, ఉరవకొండ తనిఖీ అధికారిణి రామతులసి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ జట్టుకు ప్రియాంక ఎంపిక



జి. ప్రియాంకను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన గుజ్జల ప్రియాంక జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. విజయనగరం జిల్లాలో ఈ నెల 20,21వ తేదీల్లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -19 కబడ్డీ పోటీలు జరిగాయి. ఇందులో ప్రతిభ చాటిన ప్రియాంక జాతీయ కబడ్డీ జట్టులో చోటుదక్కించుకున్నారు. జూన్ 6 నుంచి 12 వ తేదీ వరకు న్యూఢిల్లీలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి. స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ కేశవ నాయుడు, జగన్నాథరెడ్డి , జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ లక్ష్మీనారాయణ అభినందించారు. కబడ్డీ కోచ్ సంధ్య శిక్షణతోనే ఉత్తమ ప్రదర్శన ఇవ్వగలిగానని గుజ్జల ప్రియాంక పేర్కొన్నారు.

జనసేన పార్టీది నీచ సంస్కృతి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

అనంతపురం క్రైం: 'జనసేన పార్టీది నీచసంస్కృతి అని, ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌లాగే విలువలు లేకుండా కింది స్థాయి నాయకులు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి అన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి అందించని విధంగా సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారన్నారు. ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. మరోసారి ఇలాంటి నీచరాజకీయాలు చేస్తే ఊరుకునేదిలేదన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జనసేన పార్టీకి చెందిన జయరాంరెడ్డి సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వన్‌టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశామని, పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఇప్పుడు జనసేన పార్టీకి చెందిన మహిళలు వైఎస్సార్ సీపీ, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కుటుంబంపై విమర్శలు చేయడం తగదన్నారు. పవన్‌కళ్యాణ్ ప్యాకేజీ స్టార్ కాదా? అని ప్రశ్నించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు తెలియని వ్యక్తి అని పవన్ కళ్యాణ్ అని మండిపడ్డారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు భారతి, లక్ష్మి, ప్రసన్న అంజలి పాల్గొన్నారు.

అప్పులు తీర్చలేకున్నానని అదృశ్యం

రాప్తాడురూరల్: 'అప్పులు ఎక్కువగా ఉన్నాయి..తీర్చలేకపోతున్నా.. నాకోసం ఎవరూ వెతకొద్దు' అంటూ భార్య మొబైల్‌కు మెసేజ్ పెట్టి విద్యారణ్య నగర్‌కు చెందిన చంద్రశేఖర్ అనే యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం రోడ్డు విద్యారణ్యనగర్ తారా మసీదు సమీపంలో చంద్రశేఖర్, శ్వేత దంపతులు నివాసం ఉంటున్నారు. చంద్రశేఖర్ పెట్రోల్ బంక్‌లో పని చేస్తుండగా, భార్య నర్స్‌గా పని చేస్తోంది. చంద్రశేఖర్‌కు అప్పులు ఎక్కువగా ఉన్నాయి. మంగళవారం ఉదయాన్నే ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. 7 గంటల సమయంలో భార్యకు మొబైల్‌కు 'నేను అప్పు ఎక్కువగా చేశాను..తీర్చలేకపోతున్నా.. ఈ విషయాన్ని నీకు చెప్పలేకపోతున్నా.. అందుకే ఇంటి నుంచి వెళ్లిపోతున్నా.. మీరు జాగ్రత్తగా ఉండండి..'అంటూ మెసేజ్ పెట్టాడు. ఆందోళన చెందిన భార్య చుట్టుపక్కల తెలిసిన వాళ్లు, బంధువులను ఆరా తీసింది. ఆచూకీ లేకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ నబీరసూల్ కేసు నమోదు చేశారు. చంద్రశేఖర్ ఆచూకీ తెలిస్తే 94407 96811 (సీఐ) 93469 17101 (ఎస్ఐ) నంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలి

- అహుడా వీసీ మురళీకృష్ణగౌడ్



సమావేశంలో పాల్గొన్న అహుడా వీసీ మురళీకృష్ణ గౌడ్, మున్సిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి

అనంతపురం క్రైం: ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టకుండా నిర్మాణదారులు, ఎల్‌టీపీలు, తదితరులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అహుడా వీసీ మురళీకృష్ణగౌడ్ అధికారులను ఆదేశించారు. అహుడా పరిధిలోని 2,350 అక్రమ లేఅవుట్లను నిషేధిత జాబితాలో చేర్చామని, వివిధ మున్సిపాలిటీల పరిధిలోని అక్రమ నిర్మాణాలపై చార్జ్‌షీట్లు నమోదు చేయాలన్నారు. మంగళవారం మున్సిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి, డీపీఓ ప్రభాకర్ రావులతో కలిసి ఆయన నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులతో అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై సమావేశం ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లాలని ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి కమిషనర్లను ఆదేశించారు. సచివాయల పట్టణ ప్రణాళిక కార్యదర్శుల ద్వారా అనధికార నిర్మాణాలు చేపడితే చార్జ్‌షీట్, మూడేళ్ల జైలు, భూమి విలువపై రోజూ 1 శాతం అపరాధ రుసుం, కరెంటు, నీటి సరఫరా కోత, తర్వాత నిర్మాణం కూల్చివేస్తారన్న నిబంధనలపై తెలియజేయాలన్నారు. అనధికార నిర్మాణాలపై ఇప్పటికే చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఇంకా వివిధ ప్రాంతాల్లో ఉన్న అక్రమ నిర్మాణాలపై చార్జ్‌షీట్ వేస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు లైసెన్స్ ఇంజినీర్లకు మెమో జారీ చేశామన్నారు. సమావేశంలో టౌన్ కంట్రీ ప్లానింగ్ ఆర్‌డీ కార్యాలయం ఏడీ జయరాం, ఏసీపీ సువర్ణ, టీపీఓ మహబూబ్‌జాన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు మురళీ, దుర్గాంజలి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

తాడిపత్రి: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన సజ్జలదిన్నె సమీపంలోని జగనన్న కాలనీలో జరిగింది. వివరాలు..పట్టణంలోని కృష్ణాపురం 6 వ రోడ్డులో నివాసం ఉంటున్న చెన్నా మహాలక్ష్మి(35), శేఖర్ దంపతులకు ప్రభుత్వం సజ్జలదిన్నె వద్ద జగనన్న లే అవుట్‌లో స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేసింది. మంగళవారం రాత్రి ఇంటిలో లైట్ వేసే సమయంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షిప్త సమాచారం

మెడికల్ బోర్డు సర్టిఫికెట్ దరఖాస్తులపై గందరగోళం

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మెడికల్ బోర్డు సర్టిఫికెట్ దరఖాస్తులపై గందరగోళం నెలకొంది. ఉపాధ్యాయ బదిలీలు చేపడుతున్న నేపథ్యంలో మెడికల్ బోర్డు సర్టిఫికెట్ పొందేందుకు ఉపాధ్యాయులు ఆఫీస్ సూపరింటెండెంట్ కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో ఉద్యోగి రవికుమార్ ఆలస్యంగా రావడంతో పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు గుమిగూడారు. విషయం సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ దృష్టికి వెళ్లింది. ఆయన స్పందించి వేగవంతంగా దరఖాస్తులను స్వీకరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆఫీస్ సూపరింటెండెంట్ రమణ చొరవ తీసుకోవడంతో సమస్య సద్దుమణిగింది.

ఎంఆర్ఐ సేవలు పునరుద్ధరణ

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఎంఆర్ఐ సేవలు పునరుద్ధరించారు. ఎంఆర్ఐ యూనిట్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఎంఆర్ఐ సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. ఈ నెల 22న మధ్యాహ్నం నుంచి ఎంఆర్ఐ సేవలను పునరుద్ధరించారు. మంగళవారం ఉదయం నుంచి పూర్తి స్థాయిలో ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకొచ్చాయి.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు..

ప్రభుత్వ సర్వజనాస్పత్రికి సరఫరా అయ్యే తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో లీకేజీ నీరు ఆస్పత్రి ఆవరణలో నిలిచిపోయింది. ఆర్ఎంఓ డాక్టర్ వైవీ రావు అప్రమత్తమై మరమ్మతు పనులు చేయించారు. దీంతో లీకేజీ సమస్యను పరిష్కరించి, యథావిధిగా నీరు సరఫరా చేశారు.

రైతులను ఆదుకోవాలి

రాప్తాడు: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం, ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి పోతులయ్య డిమాండ్ చేశారు. ఎం.చెర్లోపల్లి, గొల్లపల్లిలో అరటి పంటలను పరిశీలించారు.

కొడుకు అదృశ్యమయ్యాడని ఆలస్యంగా ఫిర్యాదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తన కొడుకు కనిపించలేదని శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం తగరకుంటకు చెందిన పెద్దిరెడ్డి నాల్గో పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. కాగా జనవరి 10న కొడుకు అదృశ్యమైతే మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు మాట్లాడుతూ తన కొడుకు నలంద కళాశాలలో బీకాం కంప్యూటర్స్ చదువుతున్నాడన్నాడు. తనకు హోటల్ మేనేజ్‌మెంట్ చేయాలన్న కోరిక ఉండడంతో తాము కాదన్నామని, మనస్థాపంతో వెళ్లిపోయాడన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

బైక్ దొంగ అరెస్ట్..

నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎంకేఎం ఫంక్షన్ హాలు వద్ద పార్కింగ్ చేసిన సూపర్ ఎక్సెల్ వాహనం పోలీసుల వాహన తనిఖీల్లో కనిపించింది. సూపర్ ఎక్సెల్ అపహరించారని బాధితుడు లక్ష్మిరెడ్డి సోమవారం సాయంత్రం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేస్తుండగా, కనిపించింది. స్టాలిన్ నగర్‌కు చెందిన చాకలి ప్రభాకర్ తానే సూపర్ ఎక్సెల్‌ను తీసుకెళ్లినట్లు అంగీకరించాడు.

శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఉపాధ్యక్షుడిగా గుత్తా హరి

అనంతపురం కల్చరల్: సాహిత్య , సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఉపాధ్యక్షుడిగా గుత్తాహరిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ వివరాలు అందించారు. గుత్తాహరికి జాతీయ ఉపాధ్యక్షుడిగా, సమన్వయకర్తగా మరో రెండు కీలక పదవులు అప్పగిస్తున్నట్లు తెలిపారు.